# నవయుగ రత్నాలు

(ఆధునిక యుగ కవుల ప్రశంసలు)

షష్టిపూర్తి ప్రచురణ

**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు
మానవీయ శాఖ పూర్వాధ్యక్షులు
హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం

సంపాదకుడు:
**డా॥ వెలుదండ నిత్యానందరావు**
లెక్చరర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

**ఆచార్య జీవియస్ షష్టిపూర్తి ప్రచురణలు**
హైదరాబాద్ – 500 044

**NAVAYUGA RATNALU**
(An Anthology of essays on Modern Literary Personalities)
by **Dr. G.V. Subrahmanyam**
Editor : **Dr. V. Nityananda Rao.**

**A Shashtipurti Publication**

© Author

**First Edition : September - 1996**

**Copies : 1000**

**Price : Rs. 50/-**

**Cover Design : Sri Seela Verraju**

*Copies available with*
**1. Convenor**
Prof. G.V. Subrahmanyam Shashtipurti Publications
Srivani, 1-8-702/105, Nallakunta
Hydeabad - 500044 Ph : 7633275
**2. Visalandhra Book House**
4-1-435, Vigyana Bhavan, Bank Street
Hyderabad - 500 001, and other Branches
**3. Navodaya Book Sellers**
in Front of Arya Samaj, Kothi, Hyderabad

*Graphics:*
**Sri Datta Sai Graphics**
Srinvani, 1-8-702/105, Nallakunta
Hyderabad - 500044. Ph: 7633275

*Cover Page Printed at*
**Vipla Printers Private Ltd.,**
Near Shankar Math, Nallakuntha
Hyderabad - 500 044
Phone : 7636242, 667476

స్వీకర్త

మహాకవి డా. గుంటూరు శేషేంద్రశర్మగారు

# రత్నహారం

తూర్పు కొండలమీద ఎత్తుగా పిడికిలెత్తిన సూర్యుడు
పిలిస్తే పలికిన స్నేహితుడు శేషన్
అరుణకాంతి చాలలేదని సూర్యగర్భంలో
ఎఱ్రకాగడా అంటించి
మండించిన మానవుడు శేషేన్
చుక్కలన్నీ రాత్రి చీకటిబంధీఖానాలో
విప్లవ కవుల్లా వెలుగుతుంటే
పొద్దున్నే చుక్కల చొక్కావేసుకుని
కొండల్లోకి పరిగెత్తిన అక్షరాల అగ్నిబాంబు శేషన్
కవులను శిక్షించే రాజకీయ రాద్ధాంతానికి
అగ్నిపర్వతంలా పగిలి
కన్నీళ్ళను లావాగా పారించి
కావ్యారణ్యంలో కవితకు పట్టాభిషేకం చేసి
పార్లల్ ప్రభుత్వం నడిపిన
ఫిరంగిదుడు శేషన్

ఒకనాడు పద్యాన్ని ప్రేంచి మద్యంలా తాగిన మాట నిజం
ఇప్పటికి శేషేన్ కళ్ళల్లో ఆ యతిప్రాసల్లా ఆ ఎఱ్రజీరలు
పద్యశిల్పంలో ప్రాణచైతన్యంగా
పదసమాన సంఘటన శ్లేషగా
లక్ష్యంగా వ్యంగ్యంగా అంతర్గతి గమ్యంగా
సాగే శిల్పంలో దర్శించి ప్రదర్శించగల
రఘయోగి శేషేన్

అకవిత్వాల ఆగడాలను
నినాదాల పటాటోపాలను
ప్రతిభలేని ప్రసంగాలను
ప్రాణంలేని సంప్రదాయాలను
అవకాశవాదపు అంతరార్థాలను
ఎడాపెడా వాయించిన మానిఫెస్టో
కవిసేనకొక మార్చింగ్ బాండ్‌గా
పూరించిన పాంచజన్యం శేషేన్

పదేళ్ళపాటు కవిత్వం
హత్యకు గురికాకుండా
నీ కోటలో రక్షించావు శేషేన్!
బురుజుల మీదికెక్కి
బూర్జువాల మీద పోరాటం సాగించావు–
ఆగ్నేయాస్త్రంలా అభివ్యక్తిని
అక్షర జగత్తుపై అభిమంత్రించి
అమోఘంగా ప్రయోగించావ్
ఆధునిక మహాభారతంలో
అన్నింటా అర్జునుడవే శేషేన్

వందేళ్ళకో వసంతం వస్తుందని
అందంగా ఒక కోకిల కూస్తుందని
చరిత్రలో వింటూనే ఉన్నాం
ఎలియట్ ఆ జోస్యం చెబుతూనే ఉన్నాడు
అగ్నికురుస్తున్న తెలుగుతోటలో
నిప్పుల చిగుళ్ళు మేసే వేకువ కోకిల
కవిత్వంతో పాటు జీవనమాధుర్యాన్ని

పంచమస్వరంలో ఆలపించి
ఎర్రశాలువా కప్పుకుని నడుస్తూ
జేబులోని పావురాలను
గాలిలో వదిలేస్తూ
నా దేశం – నా ప్రజలు అంటూ
అరుస్తున్న ఆద్మీలా
ఘోషిస్తున్న సముద్రంలా
గిటారు పట్టుకొని వేదిక మీదకు వచ్చావు
దివారాత్రాలు ప్రతి పర్వ రసోదయంలా పాడేస్తున్నావ్
కళ్ళు మాత్రమే కనిపించే గాజు పెంకులు
ఎర్రతిలకం దిద్దుకుంటున్న కవిత్వానికి
నిటారుగా నిలబడి నిలువంతా చూచుకొనే
నిలువుటద్దాన్ని ప్రేమకానుకగా ఇచ్చిన
రసికుడవు నీవు శేషేన్!

జనవంశం నీ సాహిత్యాంశం
నీ జీవితమంతా నీకొక మహాకావ్యం:
బోద్లైర్ నీ గుండె సవ్వడి
ప్రతీక నీ ప్రాణ పంచకం
భావచిత్రం నీ ప్రణయస్ఫూర్తి
అలంకారం నీ అక్షయ సౌందర్యం
లక్షణార్థం నీ వైలక్షణ్యం
వ్యంగ్యం నీ సూక్తి జీవితం
నీ మాటలో పొగరు
నీ తీరులో వగరు
శేషేన్ మాకు కవితకు
ఉద్యమ చిహ్నాలు

నాకు తెలుసు
నీ కసరు, నీకోసం కాదని;
నీ కన్నీరు నీకోసం కాదని;
నీ పాట నీకోసం కాదని;
నీమాట నీకోసం కాదని;
సాహిత్య స్పృహకు సామాజిక స్పృహతో
సంధిచేయాలని
వాల్మీకికి బోద్లేర్‌కి బాంధవ్యం కలపాలని
ప్రపంచాకాశంలో
ఎక్కడ సూర్యుడు కనబడ్డా
ఎక్కడ చంద్రుడు కనబడ్డా
ఈ రెండింటినీ ఒకేసారి చూసేదే
కావ్యజగత్తని
పద్దెనిమిది పర్వాల ఇతిహాస నాయకుడవు
ఉక్తిని ఊపిరిగా పీలుస్తున్న
ఉత్తమ యుగకవివి

అధునాతన కవితకు
అభినవాభి వ్యక్తిని అందించిన
ఆదిశేషుడవు ఓ శేషేన్!

నవయుగ రత్నాలను
నీ కందిస్తున్నానొక ఉజ్జ్వల హారంగా
నవయుగ మహాకవితో
నా మైత్రిని అనుసంధిస్తున్నాను అమరంగా –

జి.వి సుబ్రహ్మణ్యం
హైదరాబాద్

# ఆనంద రేఖ

**డా॥ వెలుదండ నిత్యానందరావు**
లెక్చరర్, తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాదు – 500 007

ఆచార్య జీవియస్ జీనియస్ అని ఎందరో అన్నారు. అది శాబ్దిక చతురత ఎంత మాత్రమూ కాదు. స్తవం కాదు. వాస్తవం. ప్రతిష్ఠాదాయకాలు కీర్తి కారకాలు అయిన వాగ్వైఖరి, శబ్దఝరి శాస్త్ర వ్యాఖ్యాన కౌశలం వైదుష్యం పుష్కలంగా కలిగినవారు ఆచార్య జీవియస్. పాండిత్యం ఎందరికి ఉండవచ్చు. గ్రంథగ్రథన కౌశలం మరెందరికో ఉండవచ్చు. ఒక సమార్ద్రమైన హృదయం, సంస్కారపూరితమైన జీవనం కొందరికీ ఉంటుంది. అలాంటివారిలో జి.వి సుబ్రహ్మణ్యం గారు అగ్రేసరులు. తెలి నురుగులాంటి దరహాసంతో 'రండి మాష్టారూ!' అంటూ ఆప్యాయంగా ఆహ్వానిస్తారు. మా లాంటి విద్యార్థుల మీద వారు కురిపించే వాత్సల్యం సుధాసదృశం. 'శిష్యులందు నెడదం గల ప్రేముడి చెప్పలేని మెత్తన' అన్న కవి వాక్కుకు నిలువెత్తు నిదర్శనం. వారి వద్ద క్లాసురూం శిష్యరికం చేసే అదృష్టానికి నోచుకోకపోయినా వారి అభిమానానికి పాత్రమైన వారిలోనే నొకణ్ణి. వారి ఆపార సాహిత్య వ్యాసంగం అనన్య సామాన్యం, ఆశ్చర్యదాయకం. ఉద్యోగం, కుటుంబం, ఉపన్యాసాలు, రోజువారీ ప్రయాణాలు ఇన్ని బాదరబందీల మధ్య ఇంతగా ఎలా కృషి చేయగలుగుతున్నారు? తీరిగ్గా రాసే కవిత్వం కాకుండా పాతపాత పుస్తకాల నుండి కొత్త కొత్త పుస్తకాల దాక అవసరమైన ఉల్లేఖనాలను పొందుపరుస్తూ 'విమర్శలు' వెలువరించడం ఎలా సాధ్యమవుతుందీ అన్నది నాకు చేరిన మాలాంటి యువతరానికి ఎప్పుడూ అబ్బురపాటు కలిగించే సంగతి. ఆ కిటుకు చెప్పమని నేను సుబ్రహ్మణ్యం గారిని కలిసినపుడల్లా అడుగుతుంటాను. 'ఏముందీ కూర్చొని రాయడమే' అంటూ ఒకరకమైన తమాషా చిరునవ్వు నవ్వి ఊరుకుంటారు. ఇప్పుడిప్పుడే విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల్లో

సహస్రాంశం ఒంటబట్టినా జన్మ ధన్యమవుతుందన్న భావం నాకెప్పుడూ కలుగుతుంటుంది. సినారెగారన్నట్లు చూసే కళ్ళు తప్ప చదివే కళ్ళు లేని ప్రసా(చా)ర యుగంలో బతుకుతున్నాం. ఈనాడు ఎంత గొప్ప పుస్తకమైనా వ్యాసం రాయాల్సిన అవసరమో, పాఠం చెప్పాల్సిన అవసరమో మొత్తం మీద పనిపడితే తప్ప చదువలేని స్థితి దాపురించింది. జీ.వి.యస్ గారు ప్రాచీనాధునిక కావ్యాలు, కథలు నాటకాలు విమర్శలు అన్నీ ఏకబిగిన చదువుతారు. మనసు నిలుపుకోగలరు. వాటన్నింటిని సమీక్షల్లోనో, పీఠికల్లోనో ఆవిష్కరణ సభల్లోనో పత్రికా కాలమ్సులోనో ఎక్కడ అవకాశం చిక్కితే అక్కడ స్వీకృతాంశాన్ని గూర్చి అన్ని కోణాల్లోంచి అన్ని అంతరువుల్లోంచి ఔచితీశోభితంగా పరిశీలించి అంశాల వారీగా వింగడించి కానీ తృప్తి చెందరు. ఎంత మామూలు పుస్తకాన్ని గురించి రాసినా దానికొక సైద్ధాంతిక పరివేషాన్ని కల్పించి విస్మయ పరుస్తారు.

పీఠికారచనం, సంపాదకత్వం నాకు కొత్త. ఈ పీఠికతో నాకు మంచి 'బోణీ' జరిగింది. వారు అతిశయ వాత్సల్యంతో నన్నీ పనికి పురమాయించారే కాని నాకు పీఠిక రాసేంత 'అర్హత' ఉందని కాదు. అచ్చులో నాపేరు చూసుకోవచ్చు నన్న ప్రలోభం కొద్దీ, 'సూత్రం శిరసి ధార్యతే' అన్న ఆలంకారికోదాహరణం మదిలో మెదలడం కొద్దీ ఈ పనికి పూనుకొన్నానే తప్ప వేరు కాదు. తాను పుట్టిన సంవత్సరాన్ని తిరిగి దర్శిస్తున్న ఈ శుభవేళ జీవియస్ గారికి నా ఆత్మీయభావ వ్యక్తీకరణకు ఈ పని ఉపకరిస్తుందన్న మరో భావం కూడ ఉంది. అంతే తప్ప సదసద్వివేక చతురతతో ఈ వ్యాసాలను చేరీజు వేసి 'యోగ్యతాపత్రమ్' ప్రసాదిస్తున్నాననో, నా పీఠిక వారి వ్యాసాలకు 'కొలమానమ్' అనో తలపోయడం లేదు.

తమ ప్రతిభా మహత్వాలతో జాతిని విద్యుత్తరంగితం చేసిన(చేస్తున్న) 18 మంది సహృదయ విద్యాంసుల సాహిత్య వైదుష్యాల సమాలోచనం ఈ వ్యాస సంకలనం. ఆధునిక కవుల మీద ఆధునిక ప్రక్రియల మీద ఎన్నో వ్యాసాలను జీ.వి.యస్ గారు రాశారు. అందులో రత్నాల్లాంటి వారిని గూర్చి - ఏ తీరుగా వివేచించినా విస్మరింపజాలని వారిని ఎన్నుకొని ఈ షష్టిపూర్తి సందర్భంగా ఒక సాహిత్య వ్యాస సంకలనం వెలువరిస్తే ఔచితీమంతంగా ఉంటుందని షష్టిపూర్తి సారథ్య సంఘం

చేసిన నిర్ణయానికి ఆకృతి ఈ 'నవయుగ రత్నాలు ప్రక్రియ' స్వరూప స్వభావాలను విశ్లేషించడం, గుర్తించడం 'క్లాసిజం' ప్రమాణాలను అన్వేషించడం వివేచించడం ఈ పద్దెనిమిది వ్యాసాల్లో ఆచార్య జి.వి.యస్ చేసిన పని అని నేను తలపోస్తున్నాను.

సాంఘిక సమస్యానాటక ప్రక్రియలో తత్సంబంధమైన ప్రయోగాలన్నింటిలో తెలుగులో వెలసిన క్లాసిక్ – కన్యాశుల్కం.

కుందుర్తి ఉద్యమ చారిత్రక కావ్యమనే ప్రక్రియకు ఊపిరిపోశాడు.

కేవలం రోమాంటిక్ లిరిక్ ప్రవృత్తి (కాల్పనికోద్యమ కవితాచైతన్యం) తో కృష్ణశాస్త్రి ఒకరకం ప్రక్రియలకు రోమాంటిక్ లిరిక్ ఉద్యమం గాంధేయవాద, స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో గరిమెళ్లలాంటివారు ఒకరకం ప్రక్రియకు, రోమాంటిక్ లిరిక్ ప్రవృత్తి క్లాసిక్ దృక్పథం కలగలిపి విశ్వనాథ మరో రకం ప్రక్రియకు ప్రతినిధులుగా నిలిచారు.

కావ్యాలలో మహాకావ్యం ఎలా ప్రమాణరూపంగా పరిగణింపబడుతూ ఉంటుందో నవలలో కూడ 'మాలపల్లి' వంటి నవలలు క్లాసిక్ రూపాన్ని ఎంపిక ప్రమాణాలను సంతరించుకున్నది.

పురాణ ప్రక్రియలాగా నవల జీవితంలోని ఏ అంశాన్నైనా తనలో ఇముడ్చుకొనే విశాల స్వభావం కలది.

జాషువా 'గబ్బిలం', విద్వాన్‌విశ్వం 'ఒకనాడు' బోయిభీమన్న 'పాలేరు' మొ॥లగు వాటిని చర్చిస్తూ వీరి ఖండకావ్య ప్రక్రియ కాల్పనిక కవుల నుండి సంక్రమించిందైనా 'విషాదగంభీర కావ్యం' అనే కావ్యం మాత్రం ఇంగ్లీషులో ట్రాజిక్ లక్షణాలున్న 'లాంగ్ పోయెమ్' లేదా 'నేరేటివ్ పోయెమ్' అనే ప్రక్రియకు సంబంధించింది మొ॥లగునవన్నీ ప్రక్రియా వివేచనంలోని ఆలోచనాదాయకాలైన వాక్యశకలాలు.

అయితే 'వచనకవిత్వం' అనే ప్రక్రియలో కుందుర్తి ఉద్యమ చారిత్రక కావ్య నిర్మాణం ఒక ప్రయోగమే తప్ప స్వతంత్ర ప్రక్రియ నా అన్న ప్రశ్నార్థకం ఇంకా చెరిగిపోవడం లేదు. లేకపోతే జి.వియస్ గారి భావం ప్రకారంగా అయితే 'వచన కవిత్వం' అనే ఒక పెద్ద ప్రక్రియలో ఉద్యమ చారిత్రక కావ్యం అనేది ఒక ఉపప్రక్రియగా సర్దుబాటు చేసుకోవాల్సివస్తుందేమో!

ఆర్తిభావ ప్రధానమైన వసురాయకవి భక్త చింతామణి శతకానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులు అంతా ఇంతా కావు – దైవభక్తి, దేశభక్తి, జీవితంలో తేరుకోనీయకుండా

సంభవిస్తున్న విషాదానుభవాలు వడ్డాది సుబ్బారాయుడి గారిని కవిగా మలిచాయి.

తన దేశంబు స్వభాష నైజమతమున్నస్మదా చారముల్
తన దేహాత్మల నెత్తెఱంగును సదా తా నట్లు ప్రేమంచి త
ద్ఘదతావాప్తికి సాధనమ్ములగు సత్కార్యమ్ములన్ జేయగా
అనువౌ బుద్ధి మొసంగుమీ ప్రజకు దేవా! భక్త చింతామణీ

ఈ పద్యాన్ని మా కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఎప్పుడూ వినిపిస్తుంటారు. వడ్డాది సుబ్బాఆరాయకవిని గురించి జి.వి.యస్ వ్రాసిన విషయ నిర్భరమైన వ్యాసం ద్వార ఆ కవి సాహిత్య జీవిత విశేషాలు ఎన్నో తెలుస్తున్నాయి. సుబ్బారాయకవి గారికి చిన్నప్పుడు తల్లి పాలు చాలకపోతే ఆర్థర్ కాటన్ దొర ఆనకట్టను కడ్తున్న కూలీలు ఉప్పరి వనితలు స్తన్యమిచ్చి పోషించారట. ఏడవ ఏట తండ్రి 11వ ఏట తల్లి గతించారు. పిన్న వయసులో కుటుంబ భారమంతా నెత్తిన పడింది. అదేమి దురదృష్టమో సుబ్బారావుగారికి 50 ఏళ్ళ వయసు వచ్చేనాటికి వరుసగా 5మంది భార్యలు గతించారు. ఆరవ భార్య చివరి వరకు జీవించింది. ఆరు పాణిగ్రహణాల సంగతి చదివిన ఎవరికైనా కవిగారి దురదృష్టం పట్ల ఆశ్చర్యం, జాలి కలగక మానవు. ఈ కాలంలోనే అయితే కావాలనే చంపి ఉంటాడని ఆయన మీద ఎన్ని నీలాపనిందలు వేసేవారో – తరువాత కొడుకు బావమరిది చనిపోయారు – ఆ మహానుభావుడు అన్ని మరణాలను చూస్తూ శోకిస్తూ కరుణ కరుణ రస పూరితాలైన కావ్యాలు రాశారు. నాటకాలు, వచన రచనలు, పద్యకావ్యాలు రాసిన దాఖలాలను సుబ్రహ్మణ్యంగారు పొందుపరిచారు. కాని 'సుబ్బారాయ కవి జీవితమే ఒక స్మృతికావ్యపరంపర' అనిపించి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారిలో నున్న గొప్ప సుగుణం – తన దగ్గర పరిశోధనలు చేసిన విద్యార్థుల సిద్ధాంత గ్రంథాల మంచి చెడ్డలను విశ్లేషిస్తు వ్యాసాలు రాస్తారు. డా॥ నాగరంజని, డా॥ ఉషాలక్ష్మి, డా॥ వెంకటరామారెడ్డి, డా॥ జయరాములు, శ్రీమతి చంద్రిక, శ్రీనాగరాజు మొదలైన వారి ఎందరి సిద్ధాంతగ్రంథాల గురించో రాశారు. దీనివల్ల వారందరికి ప్రాచర్యం, గుర్తింపు కలిగించినట్లవుతుంది. ప్రోత్సాహమిచ్చినట్లవుతుంది. 1980వ దశకు 'సాహిత్య పరిశోధన' ను సమీక్షిస్తు జి.వి.యస్ నా పుస్తకాన్ని ఉటంకిస్తు పేర్కొనడం నన్ను ఆశీర్వదించడంగా నే నెప్పుడూ

భావిస్తుంటాను. ప్రస్తుత సంకలనలో జి.వి.యస్ గారి వద్ద పరిశోధన చేసిన డా॥ వై. కామేశ్వరిగారి 'ఆధునిక కవిత్వంలో నేను అనే సిద్ధాంత గ్రంథాన్ని గురించి చర్చించారు. ఆధునిక కవిత్వ ప్రస్తావన రాగానే దృష్టి అంతా సామాజిక స్పృహ, పీడన దోపిడి మొ77లగు అంశాల మీదికే పోతుంది. కాని సాధారణంగా ఆధ్యాత్మిక విషయాలమీదికి పోదు. ఈ సంకలనంలో విలక్షణమైన ఆలోచనాత్మకమైన వ్యాసం 'ఆధునిక ఆధ్యాత్మిక కావ్యాలు; అయిదు రకాల కవితా శైలలు. కాల్పనిక పారదర్శిక శైలి చలం 'సుధ' (1961)లోను; మార్మిక ప్రతిఫలన శైలి అరిపిరాల విశ్వం 'రేపటి స్వర్గం'(1968)లోను ఆధ్యాత్మిక తాత్త్విక మిశ్రశైలి ఆర్.యస్. సుదర్శనం నిశాంతం(1978) లోను; పురాణ ప్రతీకాత్మకశైలి దుర్గానంద్ చిరంతన(1970)లోను; ప్రతీకాత్మక శిల్పశైలి సుప్రసన్న 'పాండిచ్చేరిగీతాలు (1975) శతాంకుర(1987)లోను కనిపిస్తున్నాయని వివేచించారు.

ఆధునిక కవిత్వంలో 'ఆధ్యాత్మిక' త పరిశీలనకు ఈ మాత్రమైన స్థానం లభించిందేమో హాస్యం' ('హాస్యనవలలు' కాదు), 'కథల్లోహాస్యం' అనే అంశాలమీద ఏ యూనివర్సిటీలో పి.హెచ్‌డీలు జరగలేదంటే నమ్మశక్యం కాని నిజం – ఈ సంకలనంలో ఉత్పల సత్యనారాయణాచార్య గారి 'ఈ జంటనగరాలు' 'హేమంతశిశిరాలు' కావ్యంలోని హాస్య అధిక్షేపాలను సీరియస్ గా విశ్లేషిస్తు జి.వి.యస్ ఆధునిక సామాజిక కావ్యానికి కరుణ గర్భితమైన హాస్యాన్ని పండించారన్నారు.

ప్రతీకాత్మకాభివ్యక్తి ప్రధానంగా వెలువడిన ఆధునిక సామాజిక కావ్యాలలో బలమైన ప్రయోగాలు కె.శివారెడ్డి 'ఆసుపత్రి గీతం'(1976) నగ్నముని కొయ్యగుర్రం(1977). ఈ రెండింటిలోనూ ఒక స్పష్టమైన దృక్పథాన్ని ప్రసరించడంలోనూ వస్తుపరంగా అభివ్యక్తిపరంగా, శిల్పపరంగా ఒక సమన్వయాన్ని సమర్పించడంలోనూ కె.శివారెడ్డిగారి 'ఆసుపత్రి గీతం' అగ్రతాంబూలం అందుకొంటుంది అని జీవియస్ భావిస్తున్నారు.

ఈ వ్యాస సంకలనానికి శిఖర ప్రాయమైన వ్యాసం మధునాపంతులవారి 'ఆంధ్ర పురాణం' పై సాగిన సమాలోచనం. ఇది వాసిలో రాసిలో గౌరవాన్ని సంతరించుకొన్నది. ఆంధ్రదేశానికి ఏలికలుగా నిలిచి రూపురేఖలు దిద్దిన రాజవంశాలకు కట్టిన కీర్తి తోరణం ఆంధ్రపురాణం. కాకతీయులలో దేశాభిమానం, కాపయనాయకాదులలో

జాత్యభిమాన విద్యానగర పర్వంలో ధర్మాభిమానం క్రమంగా వికాసదశలను పొందేటట్లుగా కావ్యరచన ప్రణాళికను తయారుచేసుకొని అవి గణపతి దేవుని పాలనలోనే ప్రదర్శితమైనట్లు వర్ణించారు. అంతశ్శిల్పాన్ని పతాక స్థానంగా నిలిపి రచించటం ప్రౌఢకవికి మాత్రమే సాధ్యమైన కథాకథన శిల్పం, అని సుబ్రహ్మణ్యంగారు సోదాహరణంగా వివరించారు. ఈ వ్యాసంలోను పరిశోధక విద్యార్థులైన బి. నాగిరెడ్డి పి. శివరామశర్మ గార్ల ఎం.ఫిల్ వ్యాసాల ఉల్లేఖిస్తు రాయడం వారి సౌజన్యానికి నిదర్శనం.

జీవియస్‌గారి 'శ్రీశ్రీకవితలో పురాణప్రతీకలు' వ్యాసం సాహితీలోకంలో సంచలనం రేకెత్తించింది. ఒక పురాతన సంస్కృతీనాగరికతలు కల జాతిలో ఒక నవ్యతను ప్రబోధించదలచిన కవి సంప్రదాయార్థాలకు సరికొత్త సమన్వయాన్ని అభివ్యక్తి మార్గాల అన్వేషించక తప్పదు. సాహిత్యంలో నూత్న ప్రయోగాన్ని చేసే కవి కూడా జాతిలో ఒక భాగమే అయితే, జాతిలోని అభివ్యక్తి అతణ్ణి ఆశ్రయించి ఆకృతి దిద్దుకుంటుంది. అతని మాట అభ్యుదయ పథానికి అక్షరమార్గమౌతుంది. శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో నిర్వహించిన పాత్ర అటువంటిదని జీవియస్ పేర్కొంటూ ఆలోచనకు సంబంధించి, భావవిప్లవానికి సంబంధించి శ్రీశ్రీ పురాణ పత్రీకలకు ఎంత సమర్థంగా ఉపయోగించుకొన్నారో విశదీకరించారు.

తెంలగాణా సాహిత్య చరిత్రకు సంబంధించి దాశరథి డా॥ సి. నారాయణరెడ్డి గారలు ద్వంద్వ సమాసం.

ఏ ఒక్కరిని స్మరించినా వెంటనే మరొకరు పెదవులపై(క) మెదలక మానరు. విప్లవ కవిత్వాన్ని ఉద్యమకవిత్వాన్ని పద్యప్రప్రకియలో ప్రతిభావంతంగా పలికించా పద్య ప్రక్రియకు పరిమితులన్నాయని చెప్పేవారి వాదాన్ని తిప్పి కొట్టిన వారు దాశరథి ఆయన గేయకవితలు, వచన కవితలు ఎన్ని రాసినా శాశ్వితుడైంది తెలంగాణా ఉద్యమకాలంలో రాసిన పద్యాల ద్వారానే.

నిత్య యౌవనుడు సతత హరితం లాంటి సి.నారాయణరెడ్డిగారు షష్టిపూర్తి సందర్భంగా జీవియస్ రాసిన అభినందన వ్యాసాన్ని జీవియస్ గారి షష్టిపూర్తి సందర్భంగా ప్రచురిస్తే బాగుంటుందన్న ఆలోచనతో దీనిలో ఆ వ్యాసాన్ని చేర్చాం. సినారె జీవిత ప్రస్థానాన్ని, చేసిన ప్రయోగాలను జ్ఞానపీఠాధిరోహణందాక పొందిన

పరిణామాన్ని ఈ వ్యాసం నిరూపిస్తుంది.

ఆధునిక కవుల్లో గాఢప్రతిభుడు శేషేంద్ర. శిల్పాన్ని తిరస్కరించని విప్లవవాత్మ శేషేంద్ర – ఆయన ప్రతిభావిశేషాలను వివరిస్తు జీవియస్.

చంపికొండల్లో పారేసిన వాడి శరీరం /ఒక రాగం కోసం బిగించిన ఫిడేలులా పడి ఉంది. అతడి నోరు పాడిన పాటలు / ప్రవహించే నదులు ఆగి ఆలకించేవి / చావులేని వాడ్ని చంపే మూర్ఖులకు తెలీదు / ఏ పువ్వును మనిషికి కానుకగా ఇస్తుందో / అది వాడి నిర్మాణంలో ఉందని – ఇది శేషన్ మార్కుపోయెం. భారతంలో కురుక్షేత్ర సంగ్రామంలో దెబ్బలతో నెత్తురోడుతున్న యుద్ధవీరుల శరీరాలు పూచిన మందార వృక్షాల్లాగ ఉన్నాయని రూపించి బీభత్స సన్నివేశాన్ని రమణీయమైన ఉపమానంతో ఆస్వాదింపచేసే కళామార్గాన్ని తిక్కనగారు ప్రవేశపెట్టారు. దానిని శేషేంద్ర భావ చిత్ర పరిధిలో ప్రవేశపెట్టి విప్లవపోరాటంలో అమరుడైన వీరుని శవాన్ని శిల్ప సుందరంగా వ్యాఖ్యానించారనడం జీవియస్ ప్రతిభకు నిదర్శనం.

ఈ నవయుగరత్నాలలో ఒక రత్నంగా ఈ సంకలనంలో చోటు చేసుకోవడమే కాకుండా ఈ గ్రంథాన్ని అంకితం పొందుతున్న కవిరత్నం మహాకవి శేషేంద్ర కావడం యాదృచ్ఛికమైన సంగతే అయినా ఆనందకరం, అభినందనీయమైన అంశం.

ఇంకా కందుకూరి, గురజాడ, వేదం, రాయప్రోలు విశ్వనాథ కృష్ణశాస్త్రి జాషువా లాంటివారు తెలుగు సాహిత్య విద్యార్థుల నాలుకలందు సదా జీవిస్తు సుప్రతిష్ఠితులైనవారు వారందరి ప్రాశస్త్యానికి మూలమైన అంశాలను లోతుగా వివేచిస్తు విశ్లేషిస్తు ఆత్మీయంగా ఆలోచనాత్మకంగా ఉండి పాఠకకులకు సంతృప్తినిస్తాయి. కొత్త ఆలోచనలను మేలుకొలుపుతాయి. ఈ శతాబ్దమంతా పరుచుకొన్న బెజవాడ గోపాలరెడ్డి సాహిత్యవ్యాసంగాన్ని సరసంగా స్పృశించే వ్యాసం; కుందుర్తి 'తెలంగాణా' కావ్యవిశ్లేషణం పాఠకులను అలరిస్తాయనడంలో సందేహం లేదు.

ఈ గ్రంథమే కాదు. జీవియస్‌గారి ఏ గ్రంథమైనా ఏ వ్యాసమైనా పారిభాషిక పదబంధురతతో, మౌలికతతో ఒక కొత్త కోణాన్ని దర్శిస్తుంటాయి. ప్రదర్శిస్తుంటాయి. తెలుగు విమర్శా ప్రపంచాన్ని తన బలమైన శైలితో ఆయన అభిషేకించారు. ఒక ఆదర్శపూరితమైన పరిణతమైన మేధ, ప్రవర్తన, వ్యవహార సరళి, అభివ్యక్తి విధానం దార్శనిక దృక్పథం పరిపూర్ణంగా కలవారు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం తెలుగు

సాహిత్య విమర్శ ప్రక్రియకు ఆయనే ఒక క్లాసిక్. వారి నిరంతర అధ్యయన ఆలోచనాత్మక శీలం ఆదర్శప్రాయం. ఒక కవితలోనున్న శిల్ప వైభవాన్ని ఆవిష్కరించినా ఒక మహాప్రబంధ వస్తువివేచనం చేసినా; ఒక నవల నిర్మాణశిల్పాన్ని విప్పిచెప్పినా ఒక కథను విశ్లేషించి చూపినా; ఒక సిద్ధాంత గ్రంథాన్ని సమీక్షించినా; ఒక అంశం ఒక నిర్ణీత కాలపరిణామంలో పొందిన మార్పులను కూర్చుకున్న కొత్త సొగసులను గమనించ వలసి వచ్చినా గ్రంథగత అస్తిత్వాన్ని ఏనాడు జీవియస్ విస్మరించలేదు. అహోమూలచ్ఛేదీ తవ పాండిత్యః! అన్నట్లు వ్యవహరించలేదు. ఒక సమన్వయాత్మకమైన కొత్త చూపును అందించడానికే యత్నించారు. కొత్త సాహిత్య మూల్యాలను సిద్ధాంతాలను మెళుకువులను విమర్శకులకు పాఠకులకు అందించారు. ఒక రచయిత ప్రదర్శిస్తున్న కళాత్మక సంవేదనను పఠిత హృదయంలో ముద్రపడేలా వారధిగా దోహదం చేశారు. కొన్ని వ్యాసాల్లో అవగాహన చేసుకొనే తీరుతెన్నులను నిర్దేశించారు. మరికొన్నింటిలో నిజాలను నిర్ద్వంద్వంగా చెప్పారు. ఇంకొన్నింటిలో రచయితల దృక్పథాలను తబ్బిబ్బులను సరిచేశారు.

విస్తారమైన వారి సాహితీ వ్యాసంగంలో అందరూ అన్నిటితో ఏకీభవిస్తారని అనుకోలేం. ఏకీభవించాలనుకోవడం అత్యాశ. అందరినీ సంతృప్తి పరచడం సాధ్యమయ్యేది కూడ కాదు వారుచేసే కొన్ని వ్యాఖ్యలు వ్యక్తిగత అభిరుచికి ప్రతిబింబాలుగా కనిపించవచ్చు. కొన్ని ఔత్సాహిక ప్రతిపాదనలుగా మిగిలిపోవచ్చు. విశ్వనాథపట్ల అతిగా స్పందిస్తారన్న విమర్శకు లోనుగావచ్చు. ఇష్టానిష్టాలు అభిరుచులు ఉండడం మానవ సహజం. మనం ఏకీభవించడం ప్రమాణమూ కాదు. ఏకీభవించకపోతే వారికి న్యూనతాకాదు.

వారి మాటలతో, నేను ముగింపు చేస్తున్నాను. "మౌలికత" ఉన్న సాహిత్య విమర్శకులకు అభిమానులుంటారు. అనుయాయులుంటారు. ఒక్కొక్కసారి ఉండకపోవచ్చు. కాని అధిక్షేపకులు గాని విమర్శకులుగానీ తప్పకుండా ఉంటారు. (కొలమానం పుట 56)

– నిత్యానందరావు

16-6-96

వినాయక చతుర్థి.

**ఇందులో...**


| | | |
|---|---|---|
| 1. | ఆలోచించటం ప్రక్రియకు నేర్పిన పంతులుగారు | 1 |
| 2. | వడ్డాది సుబ్బారాయ కవి | 8 |
| 3. | రాయప్రోలు సుబ్బారావు వినూత్న ప్రతిపాదనలు – వారసత్వం | 32 |
| 4. | కన్యాశుల్కం : ప్రతాపరుద్రీయం – క్లాసిక్ ఎపిక్ ప్రమాణాలు | 45 |
| 5. | నవలాయుగానికి నాయకమణి 'మాలపల్లి' | 52 |
| 6. | విశ్వనాథ పద్యశిల్పం | 59 |
| 7. | 'మధునాపంతుల ఆంధ్ర పురాణం' | 69 |
| 8. | కృష్ణశాస్త్రి మ్రోయించిన మోహన మురళి | 96 |
| 9. | జాషువా జాతికిచ్చిన విషాద గంభీర కావ్యం | 103 |
| 10. | శ్రీశ్రీ పురాణ ప్రతీకలు | 110 |
| 11. | మహాకవి దాశరథి | 121 |
| 12. | ఉద్యమ చారిత్రక కావ్యం : కుందుర్తి 'తెలంగాణా' | 152 |
| 13. | ప్రయోగవాది పరిణామ వేది – సి.నా.రె. | 160 |
| 14. | మహాకవి శేషేంద్ర | 174 |
| 15. | వాస్తవ స్వప్నం : వాఙ్మయ చిత్రం | 183 |
| 16. | ఆధునిక ఆధ్యాత్మిక కావ్యాలు : ఐదు రకాల కవితా శైలులు | 200 |
| 17. | ఈ జంటనగరాలు హేమంత శిశిరాలు : హాస్యరసం | 207 |
| 18. | ఆధునిక సమగ్ర సామాజిక కావ్యం : 'ఆసుపత్రి గీతం' | 219 |